బుధవారం

25-09-2024

# ముందడుగు

దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 466 పేజీలు: 4 | ₹6

EPAPER.MUNDADUGU.COM


SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయొచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp:
9491114616
email: mundadugu111@gmail.com

## రైల్వే పట్టాలు తప్పేలా దుశ్చర్యలు

- కేంద్ర రైల్వేశాఖ అప్రమత్తంగా ఉంది
- రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడి





ముందడుగు జాతీయం:

దేశంలో ఇటీవల కొంతమంది దుండగులు రైళ్లు పట్టాలు తప్పేలా కొన్ని కుట్రపూరిత ప్రయత్నాలు వెలుగు చూడటం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. పట్టాలపై ఎల్‌పీజీ సిలిండర్లు, సైకిళ్లు, ఇనుప రాడ్లు, సిమెంట్ ఇటుకలు పెట్టి రైలుకు ప్రమాదం తలపెట్టే ఘటనలు కలకలం రేపాయి. ఇటువంటి వాటిపై రైల్వేశాఖ అప్రమత్తంగా ఉందని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. ఈ తరహా ఘటనలను నిర్మూలించేందుకు అనేక రాష్ట్రాల యంత్రాంగం, పోలీసులతో చర్చలు జరుపుతున్నామన్నారు. రైలు ప్రమాదాలకు ప్రయత్నించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. జైపుర్‌లో పలు మార్గాల్లో కవచ్ పనితీరును పరిశీలించేందుకు వచ్చిన రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్.. ఇటీవల వెలుగు చూస్తున్న దుశ్చర్యలపై మాట్లాడారు. "రాష్ట్ర ప్రభుత్వాలు, డీజీపీలు, హోంశాఖ కార్యదర్శులతో చర్చలు జరుపుతున్నాం. ఇందులో ఎన్‌ఐఏ కూడా భాగస్వామ్యమైంది. అటువంటి ప్రమాదాలకు ప్రయత్నించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఇది మా దృఢనిశ్చయం" అని అన్నారు. ఇటువంటి ఘటనలపై రైల్వే శాఖ అప్రమత్తంగా ఉందని.. దీనిపై రైల్వే పోలీసుల తోపాటు స్థానిక పోలీస్ స్టేషన్లతో అన్ని రైల్వే జోన్ల అధికారులు కలిసి పనిచేస్తున్నారని అన్నారు.



## సెక్యులరిజానికి మనదేశంలో స్థానం లేదు

తమిళనాడు గవర్నర్ ఆర్‌ఎన్ రవి వ్యాఖ్యలు
తీవ్రంగా ఖండించిన ప్రతిపక్షాలు

ముందడుగు :

మనదేశంలో సెక్యులరిజానికి స్థానం లేదని అది యూరప్ భావన అంటూ తమిళనాడు గవర్నర్ ఆర్‌ఎన్ రవి చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారాన్ని రేపుతున్నాయి. ఇప్పటికే పలుమార్లు వివాదస్పద వ్యాఖ్యలు చేసిన ఆయన మరో మరోసారి వార్తల్లో నిలిచారు. కన్యాకుమారిలో జరిగిన ఓ బహిరంగ కార్యక్రమంలో గవర్నర్ ఈ వ్యాఖ్యలు చేశారు. తమిళనాడు గవర్నర్ ఆర్‌ఎన్ రవి "లౌకికవాదం(సెక్యులరిజం)" పై చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారానికి తెరలేపాయి. సెక్యులరిజం అనేది యూరప్ భావన, భారతదేశంలో దానికి స్థానం లేదు.

మిగతా 2లో



శ్రీలంక నూతన ప్రధానిగా హరిణి అమరసూర్య

మిగతా 2లో



మహిళల కంటే పిల్లులకు స్వేచ్ఛ ఎక్కువ

మిగతా 2లో



విడాకుల సంస్కృతి పెరగడానికి ఇవే కారణం

మిగతా 3లో




అవయవదానంలో మహిళలే ముందంజ

మిగతా 4లో

## పరిశుభ్రమైన ఆహారం కోసం ప్రత్యేక చర్యలు

హోటళ్లకు సీసీటీవీ కెమెరాలు

చెఫ్‌లు, వెయిటర్లు మాస్కులు, గ్లౌవ్స్
ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఆదేశాలు జారీ



ముందడుగు ఉత్తరప్రదేశ్:

హోటళ్లు, రెస్టారెంట్లకు వచ్చే వినియోగదారులకు పరిశుభ్రమైన ఆహారాన్ని అందాలనే లక్ష్యంతో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. పని సమయంలో చెఫ్‌లు,

మిగతా 2లో



02

## నాలుగు రోజుల్లో 14 లక్షల లడ్డూలు అమ్మకం

- రోజుకు 3.50 లక్షల లడ్డూలు విక్రయించారు
- కల్తీ అంశం అమ్మకాలపై ప్రభావం చూపలేదు

ముందడుగు
బుధవారం, 25-09-2024, హైదరాబాద్

# సెక్యులరిజానికి మనదేశంలో స్థానం లేదు

(మొదటిపేజీ తరువాయి)

ఈ దేశ ప్రజలపై చాలా మోసాలు జరిగాయి. వాటిలో ఒకటి లౌకికవాదం. దీనికి తప్పుడు వివరణ ఇవ్వడానికి ప్రయత్నించారు. సెక్యులరిజం అంటే ఏమిటి..? సెక్యులరిజం అనేది యూరోపియన్ భావన. ఇది భారతీయ భావన కాదు.. అని భారత దేశానికి సెక్యులరిజం అవసరం లేదన్నట్లుగా ఆయన ఓ బహిరంగ కార్యక్రమంలో అన్నారు. దేశంలో సెక్యులరిజం అవసరం లేదని ఆయన చేసిన ప్రసంగాన్ని దేశంలోని రాజకీయ పార్టీలు తీవ్రంగా ఖండించాయి. ఇది ముమ్మాటికీ ఆర్ఎస్ఎస్ భావన అని, అలాంటి గవర్నర్‌ని నియమించడం సిగ్గు చేటని సీపీఎం నేత బృందా కారత్ అన్నారు. ఇదే అంశంపై సీపీఐ నేత డీ రాజా తీవ్రంగా స్పందించారు. ఫెడరలిజం, ఒక వ్యక్తి ఒకే ఓటు, ప్రజాస్వామ్య అనేవి కూడా యూరప్ నుంచే ఉద్భవించాయనే వాస్తవాన్ని గవర్నర్ మర్చిపోతే ఎలా అని కాంగ్రెస్ నేత పి. చిదంబరం సెటైర్ వేశారు. భారత రాజ్యాంగాన్ని పూర్తిగా చదవాలని డీఎంకే అధికార ప్రతినిధి టీకేఎస్ ఇలంగోవన్ గవర్నర్‌కు హితవు పలికారు.

# నాలుగు రోజుల్లో 14 లక్షల లడ్డూలు అమ్మకం

ముందడుగు తిరుపతి:



తిరుమల తిరుపతి లడ్డూను మహాప్రసాదంగా భావిస్తారు. ఇటీవల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి, జంతువుల కొవ్వు వినియోగం అంశం ప్రస్తుతం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఈ అంశం ఏపీ రాజకీయాలను కుదిపేస్తోంది. ఈ ఆరోపణల నేపథ్యంలో ప్రజలు ఎంతో ఇష్టంగా తినే తిరుమల లడ్డూ చుట్టూ వివాదం నెలకొంది. తెలుగు రాష్ట్రాలతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న శ్రీవారి భక్తులు దీనిపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ వివాదం లడ్డూ విక్రయాలపై ఎలాంటి ప్రభావం చూపలేదని టీటీడీ అధికారులు తాజాగా స్పష్టం చేశారు. గడిచిన నాలుగు రోజుల్లో మొత్తం 14 లక్షల లడ్డూలు విక్రయించినట్లు వెల్లడించారు. ఈ నెల 19న మొత్తం 3.59 లక్షల లడ్డూలు అమ్ముడయ్యాయి. సెప్టెంబర్ 20వ తేదీన 3.17 లక్షలు, సెప్టెంబర్ 21న 3.67 లక్షలు, సెప్టెంబర్ 22న 3.60 లక్షల లడ్డూలు అమ్ముడైనట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. సగటున రోజుకు 3.50 లక్షల లడ్డూలు విక్రయించామని పేర్కొన్నారు.

# పరిశుభ్రమైన ఆహారం కోసం ప్రత్యేక చర్యలు




(మొదటిపేజీ తరువాయి)

వెయిటర్లు మాస్కులు, గ్లౌవ్స్ ధరించాలని వెల్లడించింది. ఆహారశాలల వద్ద సీసీటీవీ ఏర్పాటు తప్పనిసరి చేసింది. అంతేగాకుండా హోటళ్లతో సహా జ్యూస్ షాప్‌ల వద్ద వాటి నిర్వాహకులు, మేనేజర్లు తమ పేర్లు, చిరునామాలు ప్రదర్శించాలని పేర్కొంది. ఈ సేవల విషయంలో జవాబుదారీ తీసుకురావాలనే లక్ష్యంతోనే వీటిని తీసుకువచ్చింది. తినే పదార్థాల్లో ఉమ్మివేసినట్లు, మూత్రం కలిపినట్లు వార్తలు రావడంతో ఈ ఆదేశాలు ఇచ్చిందని జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి.

లఖ్‌నవూలో జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో భాగంగా ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మాట్లాడుతూ.. "ఆహారపదార్థాల్లో మానవ వ్యర్థాలు రావడం అసహ్యకరం. అవి ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతాయి. ఆ తరహా ప్రవర్తనకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలి" అని సూచించారు. రాష్ట్రంలోని సహారన్‌పుర్‌లోని ఒక హోటల్‌లో రోటీలు చేస్తుండగా.. ఒక యువకుడు వాటిపై ఉమ్మివేస్తున్నట్లుగా ఉన్న వీడియో వైరల్ అయింది. ఘాజియాబాద్‌లోని ఒక విక్రేత జ్యూస్‌లో మూత్రం కలిపినట్లు కథనాలు వెలువడ్డాయి. ఈ తరహా ఘటనల్లో పలు అరెస్టులు చోటుచేసుకున్నాయి. ఈ వరుస పరిణామాలపై సీఎం ఆగ్రహం వ్యక్తంచేశారు. "దాబాలు, రెస్టారంట్లు, ఇతర ఆహారశాలలను క్షుణ్ణంగా పరిశీలించాలి. అలాగే అక్కడ పనిచేసే ఉద్యోగులను పోలీసులు వెరిఫై చేయాలి. ఆహార పదార్థాల స్వచ్ఛతను కాపాడేలా ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్ యాక్ట్‌కు తగిన సవరణలు చేయాలి" అని ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది.

# శ్రీలంక నూతన ప్రధానిగా హరిణి అమరసూర్య

### ప్రధాని పదవి చేపట్టిన మూడో మహిళా నేత

### హక్కుల కార్యకర్తగా, అధ్యాపకురాలిగా గుర్తింపు



ముందడుగు శ్రీలంక:

శ్రీలంక నూతన ప్రధానిగా హరిణి అమరసూర్య మంగళవారం ప్రమాణస్వీకారం చేశారు. సిరిమావో బండారు నాయకే (1994 2000) తర్వాత శ్రీలంకలో ప్రధాని పదవి చేపట్టిన మహిళా నేత హరిణి కావడం విశేషం. నేషనల్ పీపుల్స్ పవర్‌కి చెందిన 54 ఏళ్ల హరిణి అమరసూర్యతో ఆ దేశాధ్యక్షుడు అనుర కుమార దిసనాయకే ప్రమాణ స్వీకారం చేయించారు. అలాగే, మరో ఇద్దరు నేతలను క్యాబినెట్ మంత్రులుగా నియమించారు. దీంతో శ్రీలంకలో దిసనాయకేతో పాటు మొత్తం నలుగురితో కూడిన క్యాబినెట్ కొలువుదీరింది. ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన హరిణికి న్యాయ, విద్య, కార్మిక, పరిశ్రమలు, శాస్త్ర సాంకేతిక శాఖ, ఆరోగ్యం, పెట్టుబడులు వంటి కీలక శాఖలను కేటాయించారు. అధ్యక్ష ఎన్నికల అనంతరం అధికార మార్పిడిలో భాగంగా దినేష్ గుణవర్ధన తన ప్రధాని పదవికి నిన్న రాజీనామా చేసిన నేపథ్యంలో తాజా పరిణామం చోటుచేసుకుంది.

# మహిళల కంటే పిల్లులకు స్వేచ్ఛ ఎక్కువ

### పార్కుల్లో బాలికలు, మహిళలకు ప్రవేశం లేదు

### అఫ్గాన్‌పై అస్కార్ అవార్డు గ్రహీత మెరిల్ స్ట్రీప్ స్పందన

ముందడుగు డెస్క్:



అఫ్గాన్‌లో పిల్లులు కూడా స్వేచ్ఛగా తిరుగుతున్నాయని, అమ్మాయిల కంటే ఉడుతలకే హక్కులు ఎక్కువగా ఉన్నాయని హాలీవుడ్ నటి, ఆస్కార్ అవార్డు గ్రహీత మెరిల్ స్ట్రీప్ ఐరాస వేదికగా స్పందించారు. "అఫ్గాన్‌లో నేడు మహిళల కంటే ఆడ పిల్లులకే ఎక్కువ స్వేచ్ఛ ఉంది. అవి బయట కూర్చొని సూర్యరశ్మిని ఆస్వాదించవచ్చు. పార్కుల్లోకి ఉడుతలు స్వేచ్ఛగా ఎగురుతూ తిరగొచ్చు. అక్కడ అమ్మాయి కంటే ఓ ఉడుతకే హక్కులు ఎక్కువగా ఉన్నాయి. ఎందుకంటే అక్కడి పార్కుల్లో బాలికలు, మహిళలకు ప్రవేశాలను తాలిబన్లు నిలిపేశారు. ఓ పక్షి అక్కడ స్వేచ్ఛగా పాడగలదు. కానీ, మహిళలకు కనీసం ఆ స్వేచ్ఛ కూడా లేదు" అని మెరిల్ స్ట్రీప్ ఆవేదన వ్యక్తం చేశారు. న్యూయార్క్‌లో ఐరాస సాధారణ సమావేశాల వేళ ఓ చర్చలో మాట్లాడిన ఆమె.. అంతర్జాతీయ సమాజం ఏకతాటిపైకి వస్తే అఫ్గాన్ మహిళలకు మళ్లీ స్వేచ్ఛావాయువులను అందించవచ్చన్నారు.

ముందడుగు
బుధవారం, 25-09-2024, హైదరాబాద్

### కొత్త ఫోన్ కొని పార్టీ ఇవ్వలేదని

# స్నేహితుడు హత్య

## దేశ రాజధాని ఢిల్లీలో దారుణ సంఘటన



ముందడుగు ఢిల్లీ:

ఓ యువకుడి కొత్త మొబైల్ కొన్న ఆనందం కాసేపట్లోనే ఆవిరైపోయింది. స్నేహితుల దుర్బుద్ధి కారణంగా ఒక నిండు ప్రాణం గాల్లో కలిసిపోయింది. ఓ తల్లికి కడుపుకోత మిగిల్చారు. ఈ దారుణ ఘటన ఢిల్లీలోని షకర్‌పూర్‌లో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. సచిన్ అనే 16 ఏళ్ల బాలుడు ఢిల్లీలోని సకర్‌పూర్‌లో నివాసం ఉంటున్నాడు. సోమవారం స్నేహితుడితో కలిసి మొబైల్ షాపుకి వెళ్లాడు. కోరుకున్న కొత్త మొబైల్‌ను సొంతం చేసుకున్నాడు. ఆ ఆనందంతో తిరిగి ఇంటికి వస్తున్నాడు. మార్గమధ్యలో ముగ్గురు స్నేహితులు తారసపడ్డారు. కొత్త ఫోన్ కొన్నందుకు పార్టీ ఇవ్వాలంటూ ఒత్తిడి చేశారు. ఇది కాస్త ఘర్షణకు దారి తీసింది. స్నేహితుల్లో ఒకడు కత్తి తీసుకుని సచిన్‌ను పొడిచాడు. బలంగా పొడవంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు బాధితుడను ఆస్పత్రికి తరలించారు. అయితే సచిన్ చికిత్స పొందుతూ ప్రాణాలు వదిలాడు.

# విడాకుల సంస్కృతి పెరగడానికి ఇవే కారణం

## ప్రముఖ గాయని ఆశా భోంస్లే అభిప్రాయం

ముందడుగు జాతీయం:



నేటి యువతీ, యువకులు చిన్న, చిన్న సమస్యలను పెద్దవిగా చూడటం వలననే బంధాల దూరమవుతూ విడాకుల సంఖ్య పెరుగుతుందని ప్రముఖ గాయని ఆశా భోంస్లే ఆందోళన వ్యక్తం చేశారు. ఆధ్యాత్మిక వేత్త రవిశంకర్‌తో ఆమె ఓ చర్చలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విడాకుల అంశాన్ని ప్రస్తావిస్తూ.. యువతీయువకులు ఒకరిపై ఒకరు త్వరగా విసుగు చెందుతున్నారన్నారు. 'నా భర్తపై నాకు కోపం వచ్చినప్పుడు మా అమ్మ దగ్గరకు వెళ్లి కొన్ని రోజులు అక్కడే ఉండి వచ్చేదాన్ని. అంతేకానీ, విడాకులు ఇవ్వాలనే ఆలోచన ఎప్పుడూ రాలేదు. ఈ రోజుల్లో ప్రతినెలా విడాకులు తీసుకొనేవారి సంఖ్య పెరుగుతోంది. ఇలా ఎందుకు జరుగుతోంది?' అని ఆమె రవిశంకర్‌ను ప్రశ్నించారు. దానికి ఆయన సమాధానం చెబుతూ.. 'మీరు పాటలతో అందరినీ సంతోషపరుస్తారు. మీకు దేవుడిపై నమ్మకం ఉంది.. అలాగే కష్టాలను తట్టుకునే శక్తి కూడా ఉంది. నేటితరానికి సహనం తగ్గిపోయింది' అని అన్నారు.

ఈ రోజుల్లో స్త్రీలు సంతానాన్ని ఓ భారంగా భావిస్తున్నారన్నారని, అన్ని వర్గాల మహిళలు ఇదే ధోరణితో ఉన్నారన్నారు. 'ఈ రోజుల్లో స్త్రీలు సంతానాన్ని భారంగా భావిస్తున్నారు. నేను 10 సంవత్సరాల వయసులో ప్లేబ్యాక్ సింగర్‌గా కెరీర్ ప్రారంభించాను. ఆ తర్వాత నేను నా కెరీర్‌తోపాటు ముగ్గురు పిల్లల్ని పెంచి పెద్ద చేశాను. వారికి వివాహం చేశాను. ఇప్పుడు నాకు మనవరాళ్లు కూడా ఉన్నారు. నా భర్త లేకుండా నేను అన్ని బాధ్యతలను విజయవంతంగా, ఒంటరిగా నిర్వర్తించాను. నా పిల్లల చదువుల విషయంలో ఎక్కడా రాజీ పడలేదు. ఎంతో సహనంతో వ్యవహరించా. నా బిజీ వృత్తిలో రాత్రి పగలూ పని చేస్తూనే ఈ బాధ్యతలను నిర్వర్తించా' అని ఆశా భోంస్లే వివరించారు.

# కండోమ్ లేకుండా శృంగారానికే మొగ్గు

## దాద్రా నగర్ హవేలీలో కండోమ్‌ల వినియోగం అత్యధికం.. కండోమ్ వినియోగంలో రెండో స్థానంలో ఆంధ్రప్రదేశ్

ముందడుగు:


కండోమ్ వాడకుండా శృంగారం చేసే వారి సంఖ్య రోజురోజుకు పెరిగిపోతున్నది. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక విడుదల చేసిన ప్రతిసారి.. భారత దేశంలో కండోమ్ లేకుండా శృంగారం చేసేవాళ్ల సంఖ్య పెరుగుతోందని చెబుతోంది. ఈసారి కూడా అదే మాట చెప్పింది. అంతేగాక ఏయే రాష్ట్రాల్లో కండోమ్‌ల వినియోగం ఎక్కువగా ఉందో కూడా వెల్లడించింది. కండోమ్‌ల వాడకంపై ఆరోగ్య శాఖ నిరంతరం అవగాహన కల్పిస్తున్నది. అయినా దాని మాత్రం తగ్గుతోంది. ప్రస్తుతం ఏయే రాష్ట్రాలు కండోమ్‌లను ఎక్కువగా వినియోగిస్తున్నాయనే విషయం తాజా అధ్యయనంలో వెల్లడైంది. నేషనల్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫ్యామిలీ హెల్త్ నిర్వహించిన ఈ సర్వేలో.. కేంద్రపాలిత ప్రాంతం దాద్రా నగర్ హవేలీలో కండోమ్‌ల వినియోగం అత్యధికంగా ఉంది.

### బాగా తగ్గిన కండోమ్ వినియోగం

కేవలం రాష్ట్రాలపరంగా చూస్తే ఆంధ్రప్రదేశ్ కండోమ్‌ల వినియోగంలో తొలి స్థానంలో ఉన్నది. ఓవరాల్‌గా చూస్తే మాత్రం దాద్రా – నగర్ హవేలి తొలి స్థానంలో, ఏపీ రెండో స్థానంలో ఉన్నాయి. దాద్రా – నగర్ హవేలీలో ప్రతి 10 వేల జంటలలో 993 జంటలు శృంగార సమయంలో కండోమ్‌లను వినియోగిస్తున్నాయి. ఏపీలో ప్రతి 10 వేల జంటల్లో 978 జంటలు కండోమ్‌లు వాడుతున్నాయి.

### 33.07 కోట్ల కండోమ్‌లు సేల్

ఇదిలావుంటే కర్ణాటకలో మాత్రం ప్రతి 10 వేల జంటల్లో కేవలం 307 జంటలు మాత్రమే కండోమ్‌లను వినియోగిస్తున్నాయి. పుదుచ్చేరిలో ప్రతి 10 వేల జంటల్లో 960 జంటలు, పంజాబ్‌లో ప్రతి 10 వేల జంటల్లో 895 జంటలు, చండీగఢ్‌లో ప్రతి 10 వేల జంటల్లో 822 జంటలు, హర్యానాలో ప్రతి 10 వేల జంటల్లో 685 జంటలు శృంగారం కోసం కండోమ్‌లు వాడుతున్నారు. హిమాచల్ ప్రదేశ్‌లో ప్రతి 10 వేల జంటల్లో 567 జంటలు, రాజస్థాన్‌లో ప్రతి 10 వేల జంటల్లో 514 జంటలు, గుజరాత్‌లో ప్రతి 10 వేల జంటల్లో 430 జంటలు కండోమ్‌లు వినియోగిస్తున్నాయి. అదేవిధంగా దేశంలో కండోమ్‌ల గురించి తెలియని వారు ఆరు శాతం మంది ఉన్నారని తాజా నివేదిక పేర్కొంది. అంటే దేశంలో 94 శాతం మందికి మాత్రమే కండోమ్ గురించి తెలుసు. దేశంలో ఏటా సగటున 33.07 కోట్ల కండోమ్‌లు సేల్ అవుతున్నాయని అధ్యయనం తెలిపింది.



ముందడుగు
బుధవారం, 25-09-2024, హైదరాబాద్




# అవయవదానంలో మహిళలే ముందంజ

- 2023లో 18,378 అవయవ మార్పిడిలు
- అవయవదానాల్లో తెలంగాణ తొలి స్థానం
- కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడి

ముందడుగు జాతీయం:

అవయవదానం మరొకరి జీవితానికి ప్రాణం పోస్తుంది.. అవయవదానం చెయ్యాలని ప్రభుత్వాలు ప్రచారాలు సైతం నిర్వహిస్తున్నాయి. కాని అవయవదానంలో మహిళలే ముందు వరుసలో ఉన్నారని గణాంకాలు చెబుతున్నాయి. **2023**లో మొత్తం **16,542** అవయవదానాలు జరిగినట్లు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. బతికుండగానే **15,436** మంది అవయవదానానికి ముందుకు రాగా.. అందులో **9,784** మంది మహిళలు ఉన్నారు. **5,651** మంది పురుషులతో పాటు ఒక ట్రాన్స్‌జెండర్ అవయదానానికి ముందుకొచ్చినట్లు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది.

### మరొకరికి ప్రాణదానం

బతికున్న వ్యక్తులు సాధారణంగా ఒక మూత్రపిండం, కాలేయం, ఊపిరితిత్తుల్లో కొంత భాగాన్ని దానం చేస్తుంటారు. కుటుంబ సభ్యుల్లో ఎవరికైనా ఆర్గాన్లు అవసరమైనప్పుడు ముందుకొస్తుంటారు. బ్రెయిన్ డెడ్ అయిన వారి (జీవన్మృతులు) నుంచి మరికొన్ని ఇతర అవయవాలు, కణజాలాన్ని వారి కుటుంబ సభ్యుల అనుమతి మేరకు దానం చేయవచ్చు. **2023**లో ఇలా బతికున్న వారి నుంచి చనిపోయిన వారి నుంచి తీసుకున్న అవయవాలతో **18,378** అవయవ మార్పిడిలు జరిగినట్లు కేంద్రం తెలిపింది. చనిపోయిన అవయవదాతల్లో **844** మంది పురుషులు ఉండగా.. **255** మంది స్త్రీలు ఉన్నారు.

## అత్యధికంగా కిడ్నీ మార్పిడి

అవయవాల వారీగా చూస్తే గతేడాది అత్యధికంగా 13,426 కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్సలు జరిగినట్లు కేంద్రం వెల్లడించింది. 4,491 కాలేయం, 221 గుండె సంబంధిత శస్త్ర చికిత్సలు జరిగినట్లు పేర్కొంది. మరణించిన వారి నుంచి సేకరించిన అవయవదానాల్లో తెలంగాణ (252) తొలి స్థానంలో ఉండగా.. తమిళనాడు, కర్ణాటక (178) తర్వాతి స్థానంలో నిలిచాయి. ఢిల్లీలో అత్యధికంగా 2,576 మందికి కిడ్నీ మార్పిడులు జరగగా.. తమిళనాడు (1633), మహారాష్ట్ర (1305) ఆ తర్వాత స్థానాల్లో ఉన్నాయి. అవయవదానంపై ఒకప్పటితో పోలిస్తే అవగాహన పెరుగుతున్నా.. ఇతర దేశాలతో పోలిస్తే ముందుకొస్తున్న వారి సంఖ్య ఇంకా తక్కువేనని చెప్పాలి. సగటున 10 లక్షల మందిలో ఒకరు కూడా ముందుకు రావడం లేదని గణాంకాలు చెబుతున్నాయి. గతంలో ప్రధాని మోదీ సైతం తన 'మన్‌కీ బాత్'లో అవయవదానం గురించి ప్రస్తావించారు. 18 ఏళ్లు దాటిన వారు ఒక కిడ్నీ, కాలేయంలోని కొంత భాగాన్ని దానం చేయొచ్చని జాతీయ అవయవ, కణజాల మార్పిడి సంస్థ (ఎన్‌ఓటీటీఓ) పేర్కొంటోంది.

ముందడుగు
బుధవారం, 25-09-2024, హైదరాబాద్





# పారిస్ ఫ్యాషన్ వీక్‌లో బీటౌన్ మెరుపులు..

## ఫ్లైయింగ్ కిస్‌తో ఆకట్టుకున్న ఐశ్వర్యరాయ్, ఆలియా భట్

బాలీవుడ్ స్టార్ హీరోయిన్, మాజీ ప్రపంచ సుందరి ఐశ్వర్యరాయ్ బచ్చన్ (Aishwarya Rai Bachchan) ఫ్యాషన్ (Fashion) లుక్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఏ సినీ వేడుకలోనైనా, ఫ్యాషన్ షోలోనైనా ఐష్ విభిన్న కాస్ట్యూమ్స్‌తో అలరిస్తుంటుంది. ఇక కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్, పారిస్ ఫ్యాషన్ వీక్ వంటి ప్రపంచ వేదికగా జరిగే ఫ్యాషన్ షోలకు కొత్త కళను తెస్తుంటుంది ఈ నీలి కళ్ల సుందరి. ఆయా వేడుకల్లో రెడ్ కార్పెట్‌పై అలా నడుచుకుంటూ వస్తుంటే కెమెరా కళ్లన్నీ ఐష్ (Aish)వైపే ఉంటాయి.

తాజాగా ఐశ్వర్య పారిస్ ఫ్యాషన్ వీక్ (Paris Fashion Week)లో సందడి చేసింది. పారిస్‌లోని ఐకానిక్ పలైస్ గార్నియర్ ఒపెరా హౌస్‌లో జరిగిన ఈ ఫ్యాషన్‌లో ర్యాంప్‌పై క్యాట్‌వాక్‌తో హొయలు పోయింది. బెలూన్ థీమ్ రెడ్ డ్రెస్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రేక్షకులను నమస్తేతో పలకరించింది. ఫ్లైయింగ్ కిస్ ఇస్తూ సందడి చేసింది. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి.

ఇక ప్యారిస్ ఫ్యాషన్ వీక్‌లో మరో బాలీవుడ్ స్టార్ నటి అలియా భట్ (Alia Bhatt) కూడా సందడి చేశారు. లోరియల్ ప్యారిస్‌కు ప్రాతినధ్యం వహిస్తున్న అలియా.. మెటాలిక్ బ్లాక్ ఆఫ్ షోల్డర్ జంప్‌సూట్‌తో గ్లామరస్ లుక్‌తో ఆకట్టుకుంది. అమెరికన్ నటి, మెడల్ ఆండీ మెక్‌డోవెల్‌తో కలిసి ప్రేక్షకులకు ఫ్లైయింగ్ కిస్ ఇస్తూ ర్యాంప్ వాక్ చేసింది. ప్రస్తుతం అలియా ఫొటోలు, వీడియోలు వైరల్‌గా మారాయి.